
# దెయ్యాల దెబ్బలాట



- ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

"ఆ ఇంట్లో దెయ్యం తిరుగుతోంది సార్" అని చాలా తాపీగా పలికింది ఆ కంఠం.

నా భృకుటి ముడిపడింది. కన్నులు సన్నమయ్యాయి.

"దెయ్యమా!!??? నో!! నో!! ఇట్ కాంట్ బి!! ఈ రోజుల్లో కూడా దెయ్యాలు... భూతాలు... నాకెందుకో నమ్మకం కలగడం లేదు. చూడండి... మీ పేరు?..." అని అడిగాను నేను.

"సుబ్బారావు" సమాధానం చాలా నెమ్మదిగా వచ్చింది.

"ఆఁ! సుబ్బారావుగారూ ఈ ఆధునిక యుగంలో కూడా అలాంటి మూఢ నమ్మకాలు!?" నా సందేహం వెలిబుచ్చాను.

"అలా అనకండి... మీరు దేముడిని నమ్ముతారా?" సూటిగా ప్రశ్నించాడు సుబ్బారావు.

"నమ్ముతాను. అయితే!!??..."

"ఇక్కడ బయట నుంచుని ఏం మాట్లాడుకుంటాం గానీ... రండి. ఇంట్లో కూర్చుని మాట్లాడుకుందాం"అంటూ తన ఇంట్లోకి దారితీసాడు సుబ్బారావు.

నేను ముంబాయి నుంచి వచ్చి వారం రోజులు అయ్యింది. నేను అక్కడ ఒక కెమికల్ ఫాక్టరీలో మేనేజింగ్ డైరెక్టరుగా పనిచేస్తున్నాను. నా చిన్ననాటి స్నేహితుడు కామేశం అక్కడ ఉండడం చేత, కాస్త మార్పు ఉంటుంది, కొన్నాళ్ళు అతనితో గడపవచ్చని కుటుంబ సమేతంగా వచ్చాను. కామేశం ఒక ఫ్లాట్‌లో ఉంటున్నాడు. అది అతను కొనుక్కున్నాడు. అతనికి ఆ ఊరిలో ఇంకొక ఇల్లుకూడా ఉంది. ఏవో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆ ఇంటిని అమ్మడానికి చాలాకాలం నుంచీ ప్రయత్నిస్తున్నాడు. ఇల్లు అమ్మకం కావడం లేదు సరికదా కనీసం ఇంట్లోకి ఎవ్వరూ అద్దెకు రావడం లేదు. కామేశం చెప్పిన దానినిబట్టి నాకు అర్థమయ్యింది ఏమిటంటే ఆ ఇంట్లో ఏదో దోషం ఉందని దుష్ప్రచారం జరుగుతోందని. అందుచేతనే కనీసం ఎవరూ అద్దెకు కూడా రావడం లేదని. ఆ ఇంటిని చూడడానికి, అసలు విషయమేమిటో కనుక్కోవడానికి నేనూ, కామేశం వచ్చాం. కామేశం ఇంటి ప్రక్కగా ఉండే ఇంటి యజమాని సుబ్బారావు.

ముగ్గురం సుబ్బారావు ఇంటిలోకి నడిచాం. మేము వస్తున్న విషయం కామేశం ముందే తెలియజేయడంవల్ల కాబోలు ఆ ఇంటి కాఫీ టిఫిను మమ్మల్ని నిరీక్షిస్తున్నాయి. ఆ కార్యక్రమం అయ్యేవరకూ సుబ్బారావు మమ్మల్ని ఏమీ మాట్లాడనివ్వలేదు.

ఆ తరువాత మరల మాటలలో పడ్డాం.

"సార్ మీరు దేముడిని నమ్ముతున్నామంటున్నారు. దేముడు ఉంటే దెయ్యం కూడా తప్పక ఉంటుంది సార్. అసలు నేను ఏ విషయంలోనూ తేలికగా ఒక నిర్ణయానికి రాను. ఎంతో పరిశీలించిన మీదటే ఆ ఇంట్లో దెయ్యం తిరుగుతోందని చెప్పగలుగుతున్నాను" అన్నాడు సుబ్బారావు.

"అహా!" అన్నాను నేను సాలోచనగా అతని ఇంటిని, కిటికీలోంచి ప్రక్కనే ఉన్న కామేశం ఇంటిని పరిశీలిస్తూ.

"మేము ప్రక్కనే ఉంటున్నాము కదా... నిజంగా భయమేస్తోందనుకోండి... రాత్రుళ్ళు ఆ ఇంటినుంచి ఏవేవో శబ్దాలు వినబడడం, ఏదో వింత ఆకారం తిరగడం, రకరకాల కాంతులు కనపడడం... అవన్నీ నిదర్శనాలే సార్."

"కామేశం మీ ఇల్లు షుమారు ఎంతకాలం నుంచి ఖాళీగా ఉంటోంది?" అని అడిగాను నేను.

"దాదాపు సంవత్సరంనుంచీ అలాగే ఉందిరా" అన్నాడు కామేశం దిగాలుగా. "ఏదో దెయ్యం గియ్యం అని ప్రచారం జరుగుతోంది."

"సరే ఒకవేళ నిజంగా అలాంటిదే ఉందనుకుందాం... కారణం ఏమయ్యుంటుంది సుబ్బారావు గారూ!?" అని సుబ్బారావుని అడిగాను ఇంటి పరిసరాలను గమనిస్తూ. ఆ ఇంటి దరిదాపులలో ఇళ్ళేమీ లేవు. కేవలం సుబ్బారావు, కామేశం ఇళ్ళు మాత్రమే ఉన్నాయి.

"ఏం చెప్పగలం సార్... అయినా సంవత్సరం నుంచి ఖాళీగా ఉంటోందని ఆయనే చెప్పారు కదా!?... అలా ఖాళీగా ఉన్న ఇళ్ళలోకి అవీ, ఇవీ చేరతాయంటారు. అందుకే ఇంట్లో నిత్యం దీపం వెలగాలంటారు.".

"అసలు అలాంటి ప్రచారంవల్లే ఇల్లు ఖాళీగా ఉండడం, అమ్ముడు కాకపోవడం అనుకుంటాను" అన్నాను నేను సుబ్బారావు మొహంలోకి సూటిగా చూస్తూ. 'ప్రచారం'అన్న మాట వత్తి పలుకుతూ.

"అలా అనేయకండి... పిల్లా, పాపలతో ప్రక్కనే ఉన్న మాకు ఎంత భయంగా ఉంటుందో మీరే ఊహించుకోండి... సొంత ఇల్లు వదులుకోలేం... ఏదో భయం భయంగా కాలక్షేపం చేస్తున్నాం" అన్నాడు సుబ్బారావు అదోలా మొహంపెట్టి.

"ఓకె! కామేశం ఒకసారి ఇల్లు చూద్దాం నడు"అంటూ బయటకి దారి తీసాను. కామేశం ఇల్లు చూసాం. తరచుగా శుభ్రం చేయిస్తూండడం వలన కాబోలు ఇల్లు నీట్‌గా ఉంది, గాలి, వెలుతురు ధారాళంగా ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయి. నాకైతే ఆ ఇంటిలో ఏ లోపమూ కనబడలేదు.

"అంతా బాగానే ఉందిరా కామేశం. బహుశా దుష్ప్రచారంవల్ల కావచ్చు ఇంటికి అద్దెకు ఎవ్వరూ రావడంలేదు. ఇక ఇల్లు కొనుక్కోవాలనుకునే వారు కాస్త ముందూవెనకా ఆలోచిస్తారు కదా!"

నాకైతే ఇటువంటి వాటిలో నమ్మకం లేదనుకో... అఫ్‌కోర్స్ నేను భగవంతుడిని నమ్ముతాను. పూజిస్తాను. ఆ రెండూ చేసేవాడు ప్రపంచంలో దేనికీ భయపడక్కర్లేదనేది నా నమ్మకం, విశ్వాసం" అన్నాను నేను.

"కానీ ఆర్థిక ఇబ్బందులలో ఉన్న నాకు ఈ ఇల్లు కలిసిరాకుండా పోయింది" అన్నాడు కామేశం. అతని మాటలలో బాధ స్పష్టంగా ధ్వనించింది.

"అవుననుకోరా. ఒక్కోసారి కాలం కలిసి రాదంటారు చూడు. ప్రస్తుతం అదే అయ్యుంటుంది."

"నాకైతే ఇటువంటి వాటిలో నమ్మకం లేదనుకో... అఫ్‌కోర్స్ నేను భగవంతుడిని నమ్ముతాను. పూజిస్తాను. ఆ రెండూ చేసేవాడు ప్రపంచంలో దేనికీ భయపడక్కర్లేదనేది నా నమ్మకం, విశ్వాసం"

నేనూ, కామేశం ఇల్లు చూసి, తాళంవేసి బయటకు వచ్చేసరికి సుబ్బారావు గేటుదగ్గర నిలబడి ఉన్నాడు.

"సార్ ఒక్కోసారి వాస్తుదోషాలవల్ల ఇటువంటివి సంభవిస్తాయంటారు. అక్కడికి నేనూ చాలామందికి చెపుతున్నాను. ఏమీ భయపడక్కర్లేదని, మేము ప్రక్కనే బాగానే ఉంటున్నాంకదా అని. కానీ జనం ఎందుకో భయపడుతున్నారు. ఎవ్వరికైనా దుష్టశక్తులు సంచరించే ఇంట్లో ఉండాలంటే భయమేకదండీ!!??" అంటూ నవ్వాడు సుబ్బారావు. అతని నవ్వు కృత్రిమంగా అనిపించింది. అతని మాటలు నిజాయితీగా అనిపించలేదు.

"సరేనండీ సుబ్బారావుగారూ... ఈ వాస్తులాంటి విషయాలు నాకేమీ తెలియవు. మా ఆవిడని తీసుకుని మరలా వస్తాం. ఆవిడకైతే ఆ విషయాలపై అవగాహన ఉంది. ఆవిడ ఏమైనా ఉపాయం చెపుతుందేమో చూద్దాం" అంటూ కారులో అడుగుపెట్టాను. మరునాడు ఉదయం నేను, నా శ్రీమతి, కామేశం మరల కామేశం ఇంటికి వచ్చాం.

నా శ్రీమతి ఇల్లంతా కలియజూసింది. కామేశం ఆవిడకి ఏమిటో వివరిస్తున్నాడు. నేను మరల ఇల్లంతా పరిశీలించసాగాను.

నా శ్రీమతి కామేశానికి ఏవో సలహాలు ఇచ్చింది. ఏవో పూజలు, జపాలు చేయించమంది. అమ్మిపారేసే ఇల్లుకి అవన్నీ ఎందుకన్నాను నేను. కామేశం మాత్రం పూజలు, పునస్కారాలు చేయించడం మంచిది అని అభిప్రాయం వ్యక్తంచేసాడు.

అదే కామేశం నిర్ణయం అయితే నాలుగురోజులు ఆగమని, నాకు తెలిసిన పండితుడు ఒకాయన ఉన్నాడని, ఆయనని జరుగబోయే కార్యక్రమానికి నియమించుకోవచ్చని కామేశంకి చెప్పాను. 'నీకు తెలిసిన వాళ్ళెవరు ఇక్కడ ఉన్నారా!?' అన్నట్టుగా మొహం పెడుతూనే తలూపాడు కామేశం.

❖ ❖ ❖

మరుసటిరోజు ఉదయం సుబ్బారావునుంచి ఫోన్ వచ్చింది. నన్ను కామేశంని అర్జంటుగా రమ్మని ఫోన్ సారాంశం. మేము వెళ్ళేసరికి సుబ్బారావు మొహం పాలిపోయి ఉంది. అతను ఇరవై లంఖనాలు చేసినట్లు తయారయ్యాడు. సుబ్బారావు భార్య అయితే ఆపాద మస్తకమూ వణికిపోతోంది. ఆవిడ కూడా తీవ్రంగా జబ్బుపడి లేచిన మనిషిలా తయారయ్యింది. "ఏమిటి సుబ్బారావుగారూ!!!?? ఏమయ్యింది!!??" అని అడిగాను నేను. "సార్ ఆ దెయ్యం...కాదు దెయ్యాలు మామీద పగబట్టినట్టున్నాయి" అన్నాడు సుబ్బారావు భయం, భయంగా.

"దెయ్యాలా!!?" ఈసారి అన్నాడు కామేశం ఆశ్చర్యం, భయం మిళితమైన స్వరంతో.

"అవును కామేశంగారూ. రాత్రంతా దెయ్యాలు నానా గోల చేసాయి. ఇన్నాళ్ళు ఒకటే అనుకున్నాం. కానీ రాత్రి రెండు దెయ్యాలు... కీచులాటలు... కేకలు, అరుపులు... మనుషుల్లా దెబ్బలాడుకున్నాయంటే నమ్మండి... వింత వింత శబ్దాలు... మెరుపులు... అసలు ఇంకా బ్రతికున్నామంటే కేవలం ఆ దేవుడి దయ" సుబ్బారావు, భార్య చాలా భయపడిపోయారు.

అక్కడికీ ధైర్యంచేసి, నా దగ్గరున్న డూప్లికేట్ కీతో తాళంతీసి ఇల్లంతా లైట్లువేసి చూసాను. ఎక్కడా ఏమీ లేదు. మరి ఆ మెరుపులేమిటో... ఆ శబ్దాలేమిటో!!!??" సుబ్బారావు మొహంలో భయం తాలూకు ఛాయలు స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. మరలా సుబ్బారావు అన్నాడు.

"సార్!! దయచేసి ఈ ఇల్లు ఎవ్వరికన్నా అమ్మిపడెయ్యండి. ఆ ఇంట్లో నలుగురు తిరుగుతూ ఉంటే నాన్నా ఆ దుష్టశక్తులు పారిపోతాయేమో. అదీకాక మాకు కాస్త ధైర్యంగా ఉంటుంది."

"కానీ సుబ్బారావుగారూ... ఆ దెయ్యాలు... అవీ ఉన్నాయని తెలిసి..." ఇంకా ఏదో చెప్పబోతూంటేనా మాటలను మధ్యలోనే త్రుంచేసాడు సుబ్బారావు.

"నాకు తెలిసిన ఒక భూత వైద్యుడు ఉన్నాడు..." సుబ్బారావు ఏదో వివరించబోయాడు. నేను చేతితో అతనిని వారించాను. "సరే ఇంత జరిగాక నాకూ



"సరేనండి సుబ్బారావుగారూ... ఈ వాస్తులాంటి విషయాలు నాకేమీ తెలియవు. మా ఆవిడని తీసుకుని మరలా వస్తాం. ఆవిడకైతే ఆ విషయాలపై అవగాహన ఉంది. ఆవిడ ఏమైనా ఉపాయం చెపుతుందేమో చూద్దాం"

నమ్మకం కలుగుతోంది. మేమూ అదే ప్రయత్నంలో ఉన్నాము. ఇలాంటి దెయ్యాలను వదిలించాడు అని పేరు సంపాదించిన ఒకాయన నాకు తెలుసులెండి. ఏదో ఒకటి చేయాలి" అన్నాను నేను సాలోచనగా.

"సార్!! దయచేసి ఆ కార్యక్రమం ఈరోజే మొదలు పెట్టండి"అంటూ దీనంగా నా చేతులు పట్టుకున్నాడు సుబ్బారావు. నేను మౌనంగా తలూపాను. సుబ్బారావు భార్య కళ్ళమ్మట నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి.

"మీరేం కంగారు పడకండమ్మా. నేను చూసుకుంటాగా" అని ఆ దంపతులకు ధైర్యం చెప్పి, కామేశంతో బయటకి నడిచాను.

రెండురోజులు గడిచాయి. రెండురోజులలో సుబ్బారావు రెండువందలు ఫోన్‌లు చేసినట్లు చేసాడు. ఆరోజు భూత వైద్యుడు కామేశం ఇంట్లో అడుగుపెట్టాడు.

అతని ఆకారం చూస్తే నాకే భయమేసింది. జడలుకట్టిన జుట్టు, చింత నిప్పుల్లాంటి కళ్ళు, నుదుటన విభూతి, పెద్ద కుంకుమ బొట్టు, చేతిలో పుర్రె, నిమ్మకాయలు, ఎముకలు, నల్లటి డ్రెస్, మెడలో పులిగోరు పతకం, పెద్దపెద్ద రుద్రాక్షలున్న దండ.

తను ఏవేవో జపాలు, పూజలు చేసాడు. నిమ్మకాయలు కోసాడు. ఇల్లంతా నిమ్మరసం, నీళ్ళు జల్లాడు.

మరుసటిరోజు ఉదయం సుబ్బారావు కామేశం ఇంటికి వచ్చాడు.

"సార్! నిన్న రాత్రి ఏ గొడవా లేదు. ఆ దుష్టశక్తులు పారిపోయాయి. ఇల్లు వదిలి పారిపోదామనుకున్న నన్ను కాపాడారు. మీరే నాకు దేముడు" అంటూ నా కాళ్ళమీద పడ్డాడు.

"మీరు చెప్పినట్టుగా ఆ దుష్టశక్తులు పారిపోతే మావాడికి మంచిదేగా"

"అంటే... అంటే" సుబ్బారావు మరల భయంగా మొహం పెట్టాడు.

"అబ్బే! ఇంకేమీ ఉండదు లెండి గట్టిగా పూజలు చేయించాం కదా" అన్నాను నేను నవ్వుతూ. సుబ్బారావుతోపాటు కామేశం కూడా రిలీఫ్ ఫీలయ్యాడు. నేను ముంబాయి వెళ్ళిన నెలరోజులకు కామేశం ఫోన్ చేసాడు.

తన ఇల్లు అమ్ముడుబోయిందని, అనుకున్న రేటు వచ్చిందని, అంతా నావల్లేనని సంతోషం వెలిబుచ్చాడు.

"పోనీలే. ప్రాబ్లమ్ సాల్వ్ అయ్యిందిగా" అని నేనూ సంతోషం వ్యక్తంచేసాను.

"కానీ ఏమిటో... ఆ దెయ్యం... పూజలు చేయగానే వెళ్ళిపోవడం... అంతా నమ్మశక్యంగాలేదురా" అన్నాడు కామేశం.

"నమ్మకు" అన్నాను నేను నవ్వుతూ. మరలా నేనే మాట్లాడసాగాను. "దెయ్యమూ, గియ్యమూ సుబ్బారావుగాడి అభూతకల్పన. నువ్వు ఇల్లు ఎలాగైనా అమ్మెయ్యాలనుకున్నావు. వాడికి నీ ఇల్లు చీప్‌గా కొట్టేయాలనే దురాలోచన వచ్చింది. ఏదో పుకారు పెడితే ఎవ్వరూ కొనడానికి ముందుకురారు అని, 'సరే ప్రక్కనే ఉంటున్నాను కనుక ఏదో ఒక రేటుకి నేనే తీసుకుంటాను' అని అతి తక్కువ ధరకి లాగేద్దామనుకున్నాడు."

"మరి ఆ దెయ్యాలు... కీచులాటలు"

"అవన్నీ నా సృష్టి"

"నీ సృష్టా!!??"

"ఆ సుబ్బారావుగాడి కన్ను వాడి వేలితోనే పొడవాలి అని నిర్ణయించుకున్నాను. చిన్న నాటకం ఆడాను. నా ఫ్రెండొకతను చిన్నని రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే, కంప్యూటర్ ఒకటి నాకు గిఫ్ట్‌గా ఇచ్చాడు. దాని రిమోట్ రేడియస్ చాలా ఎక్కువ. రెండోసారి మీ ఇంటికి వెళ్ళినప్పుడు మీరెవరూ చూడకుండా ఆ కంప్యూటర్‌ని ఒక మూల అటకమీద పెట్టాను. రాత్రి దాని ద్వారా శబ్దాలు, కాంతులు సృష్టించాను. సుబ్బారావు గాడిని నాలుగురోజులు అదరగొట్టాను. ఆ భూత వైద్యుడు ఎవరనుకున్నావు. మా కంపెనీ డ్రైవరు. అతనిని ఆ అవతారంతో నేనే గుర్తుపట్టలేకపోయాననుకో. అతను నాటకాన్ని రక్తికట్టించాడు. అతను మీ ఇంటికి వచ్చినరోజు రాత్రే నేను కంప్యూటర్ తీసేసాను. ఆ తరువాత జరిగింది నీకు తెలిసింది... నువ్వే చెప్పింది..."

"చాలా థాంక్సురా" అన్నాడు కామేశం కృతజ్ఞతాపూర్వకంగా.

"మోస్ట్‌వెల్‌కం..." ఈసారి ఎక్కడన్నా దెయ్యాలు కావాలన్నా, పోగొట్టాలన్నా సంప్రదించండి ఈ ప్రముఖ ముంబాయి భూతవైద్యుణ్ణి" అంటూ ఫోన్‌లోనే పగలబడి నవ్వసాగాను. కామేశం నా నవ్వుతో శృతి కలిపాడు. ★


<u>రచయిత చిరునామా:</u>

**ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్**
**64-1ఎ-10/2, అంజనీకుమార్,**
**ట్రెజరీ కాలనీ, కాకినాడ-4 (తూ.గో.జిల్లా), ఆంధ్ర**
**ఫోన్: 0884- 2345782.**